సోమలింగేశ్వర ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే పోచారం

ఆలయ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

నస్రుల్లాబాద్, మార్చి 4 : మండలంలోని దుర్కి సోమలింగేశ్వర ఆలయాన్ని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ దుర్గం శ్యామల, నాయకులు మోహన్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

నస్రుల్లాబాద్, మార్చి 4 : మండలంలోని దుర్కి గ్రామ శివారులో కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ యూనిట్-2 శిబిరంలో సోమవారం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఎస్ఆర్ఎన్కే ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వలంటీర్లు సోమలింగేశ్వర ఆలయ పరిసరాల్లో పరిశుభ్రం చేసి స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ పరిసరాలను శుభ్రం చేసిన వలంటీర్లను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గంగాధర్, ప్రోగ్రాం అధికారి పోతరాజు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శ్యామల, కార్యదర్శి యోగేశ్, అధ్యాపకులు వెంకట్రావు, శ్రీనివాస్, విఠల్, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

హక్కులు, చట్టాలపై అవగాహన ఉండాలి

కామారెడ్డి, ఫిబ్రవరి 4 : సమాజంలో మహిళల రక్షణకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై పూర్తి అవగాహన ఉండాలని జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి బావయ్య అన్నారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు సోమవారం స్థానిక మంజీరా డిగ్రీ కళాశాలలో మహిళలకు వ్యాస రచన, డ్రాయింగ్, రంగోలి తదితర పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, మహిళా సాధికారిక కేంద్ర సిబ్బంది శిరీష, సౌందర్య, ఐసీడీఎస్ సూపర్వైజర్ పద్మ, సఖీ, షీటీం తదితరులు పాల్గొన్నారు.

పోటీల్లో పాల్గొన్న మహిళలు, విద్యార్థినులు

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

■ కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, మార్చి 4 : ప్రజావాణిలో వచ్చిన సమస్యలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. కామారెడ్డి సమీకృత కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. భూ సమస్యలపై వచ్చే ఫిర్యాదులను రెవెన్యూ అధికారులు తక్షణమే పరిష్కారం చూపాలని సూచించారు. భూ సమస్యలకు సంబంధించి 35, ఇండ్లకు సంబంధించి 7, పంచాయతీ రాజ్ శాఖకు 13, ఉద్యోగాల కోసం 5, పోలీసు, మున్సిపాలిటీ శాఖలకు సంబంధించి 3, గిరిజన సంక్షేమం, మద్య నిషేదం, లీడ్ బ్యాంక్, డీఆర్డీవోకు ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు వచ్చాయి. ప్రజావాణి కార్యక్రమంలో జడ్పీ సీఈవో చందర్ నాయక్, జిల్లా అధికారులు రాజారామ్, దయానంద్, శ్రీనివాస్, సింహారావు, సురేందర్కుమార్, శ్రీధర్ రెడ్డి, భార్గవ్, సుధీర్, కలెక్టర్ ఏవో మసూరి అహ్మద్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కల్యాణలక్ష్మి పేద ఆడబిడ్డలకు వరం

బీబీపేట్/మాచారెడ్డి/దోమకొండ/రాజంపేట్, మార్చి 4 : కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పేద ఆడబిడ్డలకు వరంలాందని పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. బీబీపేట్ మండల కేంద్రంలోని రైతు వేదికలో జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్కుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలకు చెందిన 20 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలమణి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, వైస్ ఎంపీపీ రవీందర్రెడ్డి, ఎంపీడీవో పూర్ణచంద్రదోయకుమార్, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీటీసీలు రవి, పల్లవి, నీరజ, మండల కో- ఆప్షన్ సభ్యుడు ఆసీఫ్, పంచాయతీ కార్యదర్శి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీబీపేట్లో కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న జడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్కుమార్, ప్రజాప్రతినిధులు

మాచారెడ్డి మండలంలోని గజ్యానాయక్తండా, ఎక్స్రోడ్లోని రైతువేదికలో కల్యాణ లక్ష్మి చెక్కులను జడ్పీటీసీ మినుకూరి రాంరెడ్డి పంపిణీ చేశారు. మండంలలోని ఆయా గ్రామాలకు చెందిన 18 మందికి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, డిప్యూటీ తహసీల్దార్ భిక్షపతి, ఆర్ఐ మాలిక్, రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దోమకొండలోని రైతు వేదికలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను జడ్పీటీసీ తిర్మల్ గౌడ్, తహసీల్దార్ సంజయ్ రావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. మొత్తం మండలంలో 26 చెక్కులు రాగా అందులో దోమకొండ 8, సంఘమేశ్వర్ 7, ముత్యంపేట్ 3, అంబర్పేట్ 2, అంచనూరు 2, సీతారాంపల్లి 1, సీతారాంపూర్(గొట్టిముక్కుల) 3 చొప్పున చెక్కులను పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాపురెడ్డి, ఎంపీడీవో రమేశ్, రాజేశ్, అనంతరెడ్డి, సీతారాం మధు, భూపాల్ రెడ్డి, గణేశ్, నరేందర్ రెడ్డి, ఎంపీవో తిరుపతి రెడ్డి, డీటీ రేఖ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలోని రైతువేదికలో కామారెడ్డి నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను తహసీల్దార్ అనిల్కుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో తలమడ్ల ఎంపీటీసీ నర్మాల రాజు, బీజేపీ మండల అధ్యక్షులు గంగారెడ్డి, నాయకులు శ్రీను, రాము, నాగరాజు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే సైన్స్ ఫెయిర్

దోమకొండ, మార్చి 4 : విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు సైన్స్ ఫెయిర్ ఉపయోగపడుతుందని జడ్పీటీసీ తిర్మల్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని త్రివేణి స్కూల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు వివిధ రకాల ప్రయోగాలను ప్రదర్శించి వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్ కుమార్, వైస్ ఎంపీపీ బాపు రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జున స్వామి కల్యాణం

కామారెడ్డి, మార్చి 4 : జిల్లా కేంద్రంలోని గొల్లవాడలో యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లికార్జున స్వామి కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ముందు గా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

షీటీంపై అవగాహన సదస్సు

కామారెడ్డి, మార్చి 4 : జిల్లా కేంద్రంలోని మంజీర డిగ్రీ, పీజీ కళాశాలలో షీటీం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి షీటీం ప్రతినిధి సౌజన్య హాజరై మాట్లాడారు. నేటి సమాజంలో విద్యార్థినులు ధైర్య సాహసాలతో సమస్యలను ఎదుర్కోవాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గురువేందర్రెడ్డి, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, డైరెక్టర్ సురేశ్గౌడ్, షీటీం బృందం, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేటి నుంచి అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమ్మె

భిక్కనూరు, మార్చి 4: తెలంగాణ యూనివర్సిటీలో 17 ఏండ్లుగా అవుట్ సోర్సింగ్ కింద పనిచేస్తున్న సిబ్బంది ఈ నెల 5 నుంచి సమ్మె చేపడుతున్నట్లు వారు తెలిపారు. ఈ మేరకు వారు సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్గౌడ్కు సమ్మె నోటీసును సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా అవుట్ సోర్సింగ్ సిబ్బంది మాట్లాడుతూ.. 17 ఏండ్లుగా పనిచేస్తున్నామని, తమకు శ్రమకు తగిన వేతనం చెల్లించడంలేదన్నారు. ఈ విషయంపై గతంలో అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నుంచి సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రవి, సిబ్బంది రాజాగౌడ్ మల్లేశ్, శ్రీమాన్, సూభాష్,సందీప్, రాజు, సుదర్శన్, సత్యం, రాజేశ్వర్,స్వామి, రజితా బాయి , హారిక తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న కలెక్టర్

కామారెడ్డి, ఫిబ్రవరి 4 : తల్లిదండ్రులు మీపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ విద్యార్థులకు సూచించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక అక్షరాస్యతపై నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నగదు బహుమతులు అందజేశారు. అడ్లూర్ ఉన్నత పాఠశాల విద్యార్థిని రక్షిత, బీబీపేట ఉన్నత పాఠశాల విద్యార్థిని రేణుక, పోస్టర్ మేకింగ్ పోటీలో అడ్లూర్ పాఠశాల విద్యార్థిని శృతికి రూ.రెండు వేల నగదును అందజేశారు. డీఈవో రాజు, లీడ్ బ్యాంక్ మేనేజర్ భార్గవ, సుధీర్, సమగ్ర శిక్ష సమన్వయ కర్తలు వేణుగోపాల్, నాగవేందర్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని ధర్నా

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

కామారెడ్డి, మార్చి 4 : జిల్లాలోని 24 మండలాల నుంచి 1,800 మంది మధ్యాహ్న భోజన కార్మికులు తమ 6 నెలల పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని, మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని వెంటనే బిల్లులను చెల్లించాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ జితేశ్ వీ పాటిల్కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజనర్సు, వెంకట్గౌడ్, వెంకటేశ్వర్లు, సోమలింగం, సత్తయ్య పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల పరిశీలన

భిక్కనూరు, మార్చి 4 : మండలంలోని జంగంపల్లిలో ఉన్న కస్తూర్బా బాలికల పాఠశాలను సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ నాగమణి సోమవారం పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించారు. మెనూ ప్రకారం భోజనం ఏర్పాటు చేయాలని సూచించారు. బియ్యంలో పరుగులు ఉండడాన్ని గమనించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం భిక్కనూరు రైతు వేదికలో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్లోని రికార్డులను పరిశీలించి, రైతులకు అందిస్తున్న సేవలపై పారా లీగల్ వలంటీర్లను అడిగి తెలుసుకున్నారు.

మొక్కల సంరక్షణ బాధ్యత

జీపీ కార్యదర్శులదే

యాచారంలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

సదాశివనగర్, మార్చి 4 : నర్సరీల్లో మొక్కలను సంరక్షించే బాధ్యత పంచాయతీ కార్యదర్శులదే అని ఎంపీడీవో సంతోష్కుమార్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన మండలంలోని యాచారం, సజ్జానాయక్, పూర్యా నాయక్, లక్ష్మీ నాయక్, వజ్జపల్లి తండా గ్రామాల్లో ఏర్పాటు చేసిన విలేజ్ నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన మొక్కలను పెంచాలని సూచించారు. ఎక్కువగా మొక్కలు నాటించిన కార్యదర్శులను గుర్తించి వారికి సన్మానిస్తామని తెలిపారు.

చెరువులో పడి ఒకరి మృతి

మద్నూర్, మార్చి 4: మండల కేంద్రానికి చెందిన స్వతంత్ర్యకుమార్(50) చెరువులో పడి మృతిచెందినట్లు హెడ్ కానిస్టేబుల్ సాయన్న తెలిపారు. మండలకేంద్రంలోని మైసమ్మ చెరువులో కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఆదివారం సాయంత్రం వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారిపడి నీటిలో మునిగి మృతి చెందినట్లు పేర్కొన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పజెప్పినట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

నోటు పుస్తకాలు, పెన్నుల పంపిణీ

నోటుపుస్తకాలు, పెన్నులను పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

పిట్లం, మార్చి 4: మండలంలోని మద్దెల్చెరు గ్రామ సమీపాన ఇటుకబట్టీ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యామ్నాయ పాఠశాల విద్యార్థులకు పిట్లం లయన్స్క్లబ్ సభ్యులు సోమవారం పెన్నులు, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షుడు కిషన్, సభ్యులు కాశిరెడ్డి, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్, సీఆర్పీ గోపాల్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు విఠల్ తదితరులు పాల్గొన్నారు.

పిట్లం టీచర్కు మహానంది అవార్డు

పిట్లం, మార్చి 4: మండలకేంద్రంలోని బ్లూబెల్స్ హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న కర్రొల్ల దేవాగౌడకు మహానంది అవార్డు వచ్చినట్లు అధ్యాపకులు తెలిపారు. జిల్లాకేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో సనాతన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాశివరాత్రి నృత్య సమ్మేళన కార్యక్రమంలో దేవాగౌడకు శ్రీవేద విద్యానంద గిరి స్వామీజీ అవార్డును ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

డిచ్పల్లి, మార్చి 4 : డిచ్పల్లిలోని ఎస్బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మగ్గం వర్క్, ఉమెన్స్ టైలరింగ్, బ్యూటీపార్లర్ మేనేజ్మెంట్, జ్యూట్ బ్యాగ్స్ మేకింగ్, ఆర్టిఫిషియల్, జువెల్లరీ మేకింగ్లో శిక్షణ ఉంటుందని వివరించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన 19 నుంచి 45 ఏండ్లలోపు మహిళలు అర్హులని, భోజనం, హాస్టల్ వసతి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 08461-295428 నంబర్కు ఫోన్ చేయాలని సూచించారు.

పార్లమెంట్ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

ఇన్చార్జి రిటర్నింగ్ అధికారి, బాన్సువాడ ఆర్డీవో భుజంగరావు

మద్నూర్, మార్చి 4: రాబోయే పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఇన్చార్జి రిటర్నింగ్ అధికారి, బాన్సువాడ ఆర్డీవో భుజంగరావు అన్నారు. సోమవారం ఆయన తహసీల్ కార్యాలయంలో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. పోలింగ్స్టేషన్లలో వసతులు, రూట్మ్యాప్ తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకంగా ఉంటుందని, పోలీసు సిబ్బందితో సమన్వయం చేసుకుంటు ఎన్నికలు సజావుగా సాగడానికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ముజీబ్, 26 రూట్ల సెక్టోరల్ అధికారులు, నియోజకవర్గ ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఎస్సై, ఏఎస్సైలు, ఎంఈవోలు, వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్డీవో భుజంగరావు

ఇంటింటికీ 'చుక్కల మందు'

నిజాంసాగర్లో ఇటుక బట్టీల వద్ద చుక్కల మందు వేస్తున్న వైద్య సిబ్బంది

నిజాంసాగర్, మార్చి 4: మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో చుక్కల మందు వేసుకోని పిల్లలకు వైద్యశాఖ, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు సోమవారం ఇంటింటికీ వెళ్లి వేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి రోహిత్ మాట్లాడుతూ.. మొత్తం మూడు రోజుల పాటు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. వంద శాతం లక్ష్యాన్ని దాటడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. మండలంలో మొత్తం 3,828 మంది చిన్నారులకు చుక్కల మందు వేయాల్సి ఉండగా 95 శాతం పూర్తిచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మధు, సుభాష్, సాయిలు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డిలో..

రామారెడ్డి, మార్చి 4: రామారెడ్డి పీహెచ్సీ పరిధిలోని గ్రామాల్లో వైద్యాధికారి డాక్టర్ సురేశ్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి చిన్నారులకు చుక్కల మందు వేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అనిల్ పర్యవేక్షించారు.

నెలాఖరులోపు లక్ష్యాన్ని పూర్తిచేయాలి

నిజాంసాగర్, మార్చి 4: ఉమ్మడి నిజాంసాగర్ మండలంలో గల 27 గ్రామ పంచాయతీల్లో ఈ నెలాఖరు వరకు వంద శాతం పన్ను వసూలు లక్ష్యాన్ని పూర్తిచేయాలని మండల పంచాయతీ అధికారి అబ్బాగౌడ్ ఆదేశించారు. సోమవారం నిజాంసాగర్ మండల కేంద్రంలో ఇంటి పన్ను వసూలు కోసం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్లో ఆయన పాల్గొన్నారు. పలు కాలనీల్లో పర్యటించి పన్ను వసూలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలో ఇప్పటి వరకు కేవలం నాలుగు పంచాయతీల్లో మాత్రమే వంద శాతం వసూలు పూర్తయిందని, మిగతా పంచాయతీల్లో 80 నుంచి 85శాతం వసూలు చేశారని తెలిపారు. వంద శాతం వసూలు చేస్తేనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి గంగారాం, పంచాయతీ సిబ్బంది సాయిలు, షాదుల్ ఉన్నారు.

పిట్లంలో..

పిట్లం, మార్చి 4: ఆస్తి పన్ను వందశాతం చెల్లించి పంచాయతీ అభివృద్ధికి కృషిచేయాలని పిట్లం పంచాయతీ కార్యదర్శి యాదగిరి అన్నారు. సోమవారం ఆయన పంచాయతీ సిబ్బంది తో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సిబ్బంది చోల శ్రీనివాస్, బసంత్ తదితరులు ఉన్నారు.

చెక్కు అందజేత

రామారెడ్డి, మార్చి 4: మండలంలోని మోషంపూర్ గ్రామానికి చెందిన ఎరుకల దుర్గయ్య కుటుంబ సభ్యులకు ఎంపీడీవో సవితారెడ్డి భూమి కొనుగోలుకు సంబంధించి రూ. 4.50 లక్షల చెక్కును సోమవారం అందజేశారు. దుర్గయ్యకు చెందిన 15 గుంటల భూమిలో జీపీ అధికారులు 2020లో వైకుంఠధామం, కంపోస్ట్ షెడ్డు నిర్మించారు. కొన్నిరోజులకు దుర్గయ్య మృతిచెందగా కుటుంబ సభ్యులు భూమి విషయమై కలెక్టర్ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో అధికారులు కలెక్టర్ ఆదేశాల మేరకు దుర్గయ్యకు చెందిన భూమిని పంచాయతీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించి, కుటుంబానికి రూ.4.50 లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు మండల కార్యాలయంలో అందజేశారు.

జిల్లా జైలులో రిమాండ్ ఖైదీ మృతి

వినాయక్నగర్, మార్చి 4 : నిజామాబాద్ జిల్లా జైలులో రిమాండ్లో ఉన్న ఖైదీ సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. పోలీసుల ద్వారా అందిన సమాచారం మేరకు కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలానికి చెందిన దండుగుల తిరుమలయ్య (28) ఎల్లారెడ్డి పరిధిలో చోరీ చేసిన కేసులోఎనిమిది నెలలుగా జిల్లా జైలులో రిమాండ్లో ఉన్నాడు. సోమవారం తెల్లవారుజామున తిరుమలయ్య నిద్రలేవకపోవడంతో తోటి ఖైదీలు జైలు సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది అతడిని జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించగా నిద్రలో గుండెపోటుతో మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. జైలు అధికారులు ఆరో టౌన్ పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ

డోంగ్లి, మార్చి 4: మండలంలోని మదన్ హిప్పర్గ గ్రామంలో ఎంపీ నిధులు రూ. 5 లక్షలతో చేపట్టనున్న బీసీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి స్థానిక నాయకులు సోమవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో విండో మాజీ చైర్మన్ అశోక్ పటేల్, మాజీ సర్పంచ్ రాజు పటేల్, మాజీ ఎంపీటీసీ శెట్కార్ హన్మంత్ రావు, వెంకట్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రాలు ప్రారంభం

ఎల్లారెడ్డి రూరల్/ పెద్దకొడప్గల్/ సదాశివనగర్/ రామారెడ్డి/బిచ్కుంద/బాన్సువాడ రూరల్, మార్చి 4: జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపల్ కార్యాలయాల్లో సోమవారం ప్రజాపాలన సేవా కేంద్రాలను ప్రారంభించారు. పెద్ద కొడప్గల్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన కేంద్రాన్ని ఇన్చార్జి ఎంపీడీవో సూర్యకాంత్ ప్రారంభించి మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు అమలుచేసే వరకు ప్రజాపాలన కేంద్రం కొనసాగుతుందని తెలిపారు. అనంతరం ప్రజాపాలన కేంద్రంలో ఆరు గ్యారెంటీల కోసం దరఖాస్తులను స్వీకరించారు. రామారెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఎంపీడీవో సవితారెడ్డి ప్రారంభించారు. గృహజ్యోతి పథకానికి సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే ప్రజా పాలన కేంద్రానికి వచ్చి పరిష్కరించుకోవాలని ఎంపీడీవో సూచించారు. సదాశివనగర్ ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా పాలన సేవా కేంద్రాన్ని ఎంపీడీవో సంతోష్కుమార్ ప్రారంభించారు. ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకున్న వారు తప్పులు లేదా మార్పులు ఉంటే సరి చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు. బిచ్కుంద మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలన సేవా కేంద్రాన్ని ఇన్చార్జి ఎంపీడీవో గోపాల్ ప్రారంభించారు.బాన్సువాడ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలన సేవా కేంద్రాన్ని ఎంపీవో సత్యనారాయణతో కలిసి ఎంపీడీవో బషీరుద్దీన్ ప్రారంభించారు. అనంతరం ఎంపీడీవో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. సేవా కేంద్రం వద్ద ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత అధికారి అందుబాటులో ఉంటారని అధికారులు తెలిపారు.

సదాశివనగర్ మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తుదారుల సందడి

సంక్షిప్తంగా..

■ **తాగునీటి పైప్లైన్కు లీకేజీ:** పెద్దకొడప్గల్, మార్చి 4: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో మిషన్ భగీరథ తాగునీటి పైపునకు లీకేజీ ఏర్పడి నీరు వృథాగా పోతుంది. వారం రోజుల క్రితం తాగునీటి సరఫరా చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం నీరు సరఫరా అవుతుండగా.. పైపులైన్కు లీకేజీ ఏర్పడి వృథాగా పోతున్నదని, అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

■ **రేపు పాఠశాల వార్షికోత్సవం:** ఎల్లారెడ్డి రూరల్, మార్చి 4: పట్టణంలోని జడ్పీపీ బాలికల ఉన్నత పాఠశాల 69 వ వార్షికోత్సవాన్ని ఈ నెల 6న నిర్వహించనున్నట్లు ఎంఈవో వెంకటేశం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బాలాగౌడ్ ఫంక్షన్ హాల్లో సాయంత్రం నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మదన్మోహన్రావ్, ప్రధాన వక్తగా ప్రముఖ విద్యావేత్త హరిస్మరణ్ రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

■ **జీమా చెక్కు అందజేత:** గాంధారి,మార్చి 4: తపాలా శాఖ ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు పాలసీ చెక్కును సోమవారం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన చాకలి రాజశేఖర్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందాడు. ఆయనకు స్థానిక పోస్టాఫీస్లో యాక్సిడెంటల్ టాటా ఏఐజీ పాలసీ ఉండడంతో రూ. 10 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు చెక్క